

సాక్షి విశాఖపట్నం

బుధవారం ၊ 8 ၊ మార్చి ၊ 2023



న్యూస్‌రీల్

పోర్టును సందర్శించిన ఐఏఎస్‌ల బృందం



ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన అధికారుల బృందంతో పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు

దొండపర్తి: భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నుంచి ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన అధికారుల బృందం మంగళవారం విశాఖ పోర్ట్ అథారిటీని సందర్శించింది. పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు వారికి స్వాగతం పలికారు. అనంతరం పోర్టు పరిపాలన కార్యాలయం బోర్డ్ రూమ్‌లో వారితో సమావేశమై అభినందించారు. ఈ సందర్భంగా పోర్టులో మౌలిక వసతులు, ఎగుమతులు, దిగుమతులు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. పోర్టులో ఆధునికీకరణ, యాంత్రీకరణ అంశాలను, 100 శాతం సోలార్ విద్యుత్ వినియోగిస్తున్న తీరును వారికి తెలియజేశారు. పోర్టు అంతర్గత అవసరాల కోసం వినియోగిస్తున్న నీటి శుద్ధి ప్రక్రియను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబె, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

ద్వైపాక్షిక సహకారంతో మెరుగైన ప్రగతి

ఏయూక్యాంపస్: భారత్–అమెరికా దేశాల ద్వైపాక్షిక సహకారంతో మెరుగైన ప్రగతి సాధ్యపడుతుందని యూఎస్ కాన్సులేట్(హైదరాబాద్) చీఫ్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ సెక్షన్ అధికారి సీన్ రూత్ అన్నారు. ఏయూ డీపీఐఐటీ–ఐపీఆర్ చెయిర్, అమెరికన్ కార్నర్ సంయుక్తంగా ఏయూలోని జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 'యుఎస్–ఇండియా టెక్ కోలాబిరేషన్' అంశంపై ప్రసంగించారు. క్రిటికల్ ఎమర్జింగ్ టెక్నాలజీ రంగంలో రెండు దేశాలు సంయుక్తంగా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి సంయుక్తంగా ఎక్స్‌పోలు, హ్యాకథాన్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, అమెరికన్ కార్నర్ మెంటార్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ పురుషోత్తం పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

మురళీనగర్: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఐ.టి.ఐ.(పాత) ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీ నుంచి నిరుద్యోగ యువతీ యువకులకు పీఎంకేవీవై–4.0 శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలోని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, జనరల్ ప్లంబర్, ఫీల్డ్ టెక్నీషియన్ ఇన్ ఆర్ అండ్ ఏసీ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి.. ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి కల్పిస్తామన్నారు.

డైట్ టెండర్లకు ఆహ్వానం

మహారాణిపేట : ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులకు ఇచ్చే డైట్ సరఫరాకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు. డైట్ ధరలు పెంచడం వల్ల ప్రస్తుతం అమలు చేస్తున్న టెండర్లు రద్దు చేశారు. యలమంచలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (50 పడకలు) ఆస్పత్రిలో రోగులకు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరా చేయడం కోసం కాంట్రాక్టర్/సరఫరాదారుల నుంచి రెండు సంవత్సరాల కాల పరిమితి కోసం సీల్డ్ టెండర్లు ప్రస్తుతం ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు డైట్ చార్జీస్ రూ.40 నుంచి రూ.80కు, డ్యూటీ డాక్టర్లకు రూ.80 నుంచి రూ.100కు పెంచారు. ఈ నెల 8 నుంచి 11 వరకు పెందుర్తి జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి కార్యాలయంలో టెండరు ఫారాలను పొందవచ్చు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను పెందుర్తి పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి కార్యాలయంలో అందజేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

జిల్లా ఫెన్సింగ్ జట్టు ఎంపిక నేడు

మధురవాడ: కాకినాడలో ఈ నెల 10 నుంచి జరిగే 9వ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 96405 22141, 91827 16430లలో సంప్రదించాలని సూచించారు.

● మట్టి మహిళలు!

వీరంతా శ్రామిక మహిళా జీవులు! పొట్టకూటి కోసం పొరుగు జిల్లాల నుంచి వచ్చారు. విశాఖ నగరంలో పచ్చదనం పరచుకునే పనిలో పాలు పంచుకుంటున్నారు. తాము పడే కష్టాన్ని ఇసుమంతైనా పట్టించుకోరు. ముఖాన చిరునవ్వులు చిందిస్తూ కాయకష్టంలో మమేకమవుతారు. మండుటెండనూ పండు వెన్నెల్లానే భావిస్తారు. అలాంటి మహిళామణులే వీరంతా. ఆర్కే బీచ్‌లో చేపడుతున్న సుందరీకరణ పనుల్లో చెమటోడుస్తూ నిమగ్నమయ్యారు ఈ మట్టి మహిళలు.!

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఆకాశమే హద్దుగా..

ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందన్నారు మహాకవి గురజాడ. ఆయన మాటను నిజం చేస్తూ.. ఆకాశమే హద్దుగా సత్తా చాటుతామంటున్నారు నేటి మహిళలు. ఆలన–పాలన నుంచి ఆర్మీ, అంతరిక్షం వరకు ఎందాకైనా వెళ్లే సాహసం వారి సొంతం. ఏదైనా సాధించగల ఆత్మవిశ్వాసం వారి ఆయుధం.

సాక్షి, విశాఖపట్నం: అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులకు ఎందులోనూ తీసిపోమని తమ తమ వృత్తులలో ప్రావీణ్యతను చాటుకుంటున్నారు. అమ్మలా లాలించడమే కాదు... సమర్థవంతంగా పాలించడంలో తమదైన ముద్ర వేసుకుంటున్నారు. జిల్లాలో అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా సమర్థంగా పనిచేస్తున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి వంటి ప్రజాప్రతినిధులు పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఇక ఎస్పీ గౌతమి సాలి, డీఈవో చంద్రకళ అధికారులుగా రాణిస్తున్నారు. ఈ స్థాయికి రావడం వెనుక వారి కృషి, ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానం వారి మాటల్లోనే..

మహిళలు పరస్పరం సహకరించుకోవాలి..



నాకు అమ్మానాన్నల ప్రోత్సాహం ఎంత వరకు ఉందో... ఐపీఎస్ సాధించడం వెనుక స్నేహితుల సహకారం కూడా అంతే ఉంది. ప్రస్తుతం విజయనగరం ఎస్పీగా పనిచేస్తున్న దీపిక కుమారి, చిత్తూరు ఎస్పీగా పనిచేస్తున్న అపూర్వ ఇద్దరూ నాకు స్నేహితులు. వారిద్దరి నుంచి చాలా నేర్చుకున్నాను. ఎంతో ప్రతిష్టాత్మకమైన పోలీస్ ఉద్యోగంలో చేరిన తర్వాత నా సీనియర్లు, జూనియర్ల నుంచి కూడా వృత్తిపరమైన ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. ఒక మహిళకు మరో మహిళ సపోర్టుగా నిలవాలి. ఒక పోలీస్ అధికారిగా ప్రజలకు రక్షణగా నిలుస్తున్నందుకు ఆనందంగా ఉంది.

– గౌతమి సాలి, ఎస్పీ

చదువే ముందుకు నడిపించింది..



ముంచంగిపుట్టు మండలం లబ్బూరు వంటి గిరిజన గ్రామంలో పుట్టిన నేను ఈరోజు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్నానంటే.. నా చదువు సంధ్యలే అందుకు కారణం. పెళ్లయినా నేను చదువు ఆపలేదు. భర్త సహకారంతో డిగ్రీ పూర్తి చేశాను. ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా రోజుకు సుమారు 240 కిలోమీటర్లు ప్రయాణిస్తూ బీఈడీ చదువుకోవడానికి చోడవరం వచ్చేదాన్ని. అలాగే పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. పాడేరులోని సెయింటాన్స్ పాఠశాలలో టీచర్ పనిచేస్తుండగా అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి ప్రవేశించాల్సివచ్చింది. ముంచంగిపుట్టు జెడ్పీటీసీగా గెలవడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశమిచ్చారు. చదువే నన్ను ఇంతటిదాన్ని చేసిందని నమ్ముతున్నాను. విద్యావంతురాలైన మహిళ నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదు. తలచుకోవాలే గానీ అతివకు సాధ్యం కానిదేమీ ఉండదు కదా.

– జె.సుభద్ర, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్

అమ్మాయిలు ఆర్థికంగా ఎదగాలి



డిగ్రీ చేశాను. బీఈడీ చదివాను. నాకు తొలుత రాజకీయాలంటే ఇష్టం లేదు. మా కుటుంబం తొలి నుంచి రాజకీయాల్లో ఉన్నా.. నేను మాత్రం తొలిసారిగా నా భర్త ప్రోద్బలంతోనే 11వ వార్డు కార్పొరేటర్‌గా పోటీ చేశాను. కార్పొరేటర్‌గా గెలిచిన మరుక్షణం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేయర్‌గా అవకాశం కల్పించారు. అనూహ్యంగా విశాఖ నగరానికి ప్రథమ మహిళను అయ్యాను. మహిళలు సత్తా చూపాలి.. అత్యున్నత శిఖరాలను అందుకోవాలన్న సీఎం ఆశయాన్ని నెరవేర్చడానికి అహర్నిశలు కృషి చేస్తున్నాను. అతివలు ఏ పనైనా సమర్థవంతంగా చేయగలరు. ఇంటి బాధ్యతలతోపాటు సామాజిక కార్యకలాపాలను సైతం నేర్పుగా నెరవేర్చగలరు. ప్రతి అమ్మాయి కూడా చక్కగా చదువుకొని, ఆర్థికంగా ఎదగాలి.

– గొలగాని హరివెంకటకుమారి, మేయర్

మహిళలకు అపార అవకాశాలు



ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగింది. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అమ్మ ఒడి పథకం మహిళలకు ఆర్థిక దన్నుగా నిలుస్తోంది. బాలికలు చదువుల్లో రాణిస్తున్నారు. ఇది మంచి పరిణామం. బాలిక విద్య ప్రోత్సాహంతో భవిష్యత్ తరాలు బాగుంటాయి.

– ఎల్.చంద్రకళ, డీఈవో

సేవ చేయాలనే తపనతోనే రాజకీయాల్లోకి..



సేవ చేయాలన్న తపనే రాజకీయాలవైపు నడిపించింది. దంతవైద్యాధికారి ఉద్యోగం వదలి ఇటువైపు వచ్చా. అరకు నియోజకవర్గంలోని అనంతగిరి మండలం భీమవరం గ్రామం మాది. అమ్మ శోభా హైమావతి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆమె రాజకీయ వారసత్వాన్ని అందుకున్నాను. శ్రీకాకుళం సాయి డెంటల్ కళాశాలలోని చదువుకున్నా. ఆ సమయంలోనే గణేష్‌తో పరిచయం ఏర్పడి, ప్రేమవివాహం చేసుకున్నా. అనంతరం విశాఖపట్నంలోని దంతవైద్యాధికారిగా పనిచేశా. సేవా చేయాలన్న తపనతో సాలూరు నుంచి జెడ్పీటీసీగా గెలుపొంది, విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టాను. ఏపీ బెస్ట్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రధానమంత్రి మోదీ చేతులు మీదుగా అవార్డు అందుకున్నాను. మహిళలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యతకు ఆకర్షితురాలినై వైఎస్సార్‌సీపీలో చేరాను. జీసీసీ చైర్‌పర్సన్ బాధ్యత చేపట్టి, జీసీసీ బలోపేతానికి కృషిచేస్తున్నాను. మహిళలు కష్టాల్లో కుంగిపోకుండా ఎదుర్కొంటే అనుకున్న దానిని సాధించవచ్చు.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

అప్పన్నకు పెళ్లి కుదిరింది..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి పెళ్లి కుదిరింది. సింహగిరి నుంచి కొండ దిగువకు వచ్చి తనకు పిల్లనివ్వమని తన సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని స్వామి అర్థించాడు. ఏం చూసి పిల్లనివ్వాలని తొలుత నిరాకరించిన పైడితల్లి అమ్మవారు... ఆ తర్వాత స్వామికి ఉన్న వైభవాన్ని, ఆయనకున్న భక్తజన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చివరకు పిల్లనివ్వడానికి అంగీకరించింది. దీంతో ఈ నెల 22న ఉగాది రోజున పెళ్లిరాట ఉత్సవం, ఏప్రిల్ 2న చైత్ర ఏకాదశిని పురస్కరించుకుని వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి డోలోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఏఈవోలు ఎస్.ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు ,గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.



స్వామికి అడవివరంలో తిరువీధి

హోలీ జోష్





ఒక్క రోజు ముందుగానే నగరం రంగులమయమైంది. హోలీ వేడుకలను నగరంలోని మార్వాడీలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్కులో రెయిన్ డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. హోలీ పండగకు ఒక్క రోజు ముందుగానే హోలికా దాహనం చేసి రంగులు పూసుకోవడం మార్వాడీల సంప్రదాయం. దీంతో నగరంలో ఒక్క రోజు ముందుగానే హోలి వేడుకలు ప్రారంభమయ్యాయి. – బీచ్‌రోడ్డు



ఎమ్మెల్సీ గెలుపుతో రాజధానికి స్వాగతం పలుకుదాం



శిష్టకరణాల సంఘీభావ సభలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ కృష్ణయ్య

- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి
- సీతంరాజుకు మద్దతు తెలిపిన కళింగ వైశ్య, శిష్టకరణాలు, క్షత్రియ, రెడ్డి సంక్షేమ సంఘాలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుని.. పరిపాలన రాజధానికి స్వాగతం పలుకుదామని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర కళింగ వైశ్య, శిష్టకరణాలు, క్షత్రియ, రెడ్డి సంక్షేమ సంఘాలు మంగళవారం ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతు తెలిపాయి. పీఎంపాలెంలోని ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో ఉత్తరాంధ్ర కళింగ వైశ్యుల సమావేశం జరిగింది. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు, శిష్ట కరణాల సంఘం నాయకుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వై.వి సుబ్బారెడ్డి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, శిష్టకరణాల జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు డీవీ కృష్ణారావు, పోలుమహంతి ఉమా మహేశ్వరరావు, శిష్టకరణాల సంఘ ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు. శ్రీ వేమన సంక్షేమ సంఘం, గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో జరిగిన ఆత్మీయ కలయికలో ఎంపీ కృష్ణయ్య, ఎమ్మెల్యే నాగిరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, వీరరాఘవరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సీతమ్మధారలోని కె.ఎ.స్.ఆర్ ఫంక్షన్ హాలులో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో క్షత్రియ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వై.వి సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీతంరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఆర్య వైశ్యుల సమస్యల పరిష్కారానికి ఢిల్లీ స్థాయిలో పాటుపడతామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, ఉత్తరాంధ్ర కళింగ వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

జీఐఎస్‌తో 6 లక్షల ఉద్యోగాలు



మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య

- సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం
- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇటీవల నగరంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13.05 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయన్నారు. ఈ సమ్మిట్ విజయవంతం అవ్వడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. అందుకు సహకరించిన మీడియా, పత్రికా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే గ్రామ సచివాలయాల ద్వారా లక్షల ఉద్యోగాలు కల్పించామని.. జీఐఎస్ సదస్సు ద్వారా 6 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పట్టభద్రులంతా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి.. రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని కోరారు.

పార్లమెంట్ ముట్టడికి చలో ఢిల్లీ

బీచ్‌రోడ్డు: చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించడమే తన జీవిత ఆశయమని ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. బీచ్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో మంగళవారం వివిధ విభాగాలతో ఆయన సమావేశం నిర్వహించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా అన్ని రంగాల్లో బీసీలకు సరైన ప్రాతినిథ్యం దక్కలేదన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన కోసం ఏప్రిల్ 2, 3 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీతంరాజు గెలుపునకు బీసీ పట్టభద్రులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్, నీలం వెంకటేష్, ఎన్.మారేష్, పితాని ప్రసాద్, వారణాసి అన్నాజీ రావు, ధర్మరాజు, 29వ కార్పొరేటర్ వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సీఎం జగన్ పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. ఇప్పటివరకూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా.. చట్టసభల్లో బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి, మంత్రులతో పాటు 65 శాతం అవకాశం కల్పించారన్నారు. రాష్ట్రంలో 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి 672 మంది డైరెక్టర్లను నియమించారని గుర్తు చేశారు. బీసీల రిజర్వేషన్ కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు పెట్టించడం చారిత్రాత్మక విషయమన్నారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి.. బీసీలకు ఎంత చేస్తే అంత అండగా ఉంటామని సందేశం ఇవ్వాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, డిప్యూటీ మేయర్‌లు జి.శ్రీధర్, సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్

మహారాణిపేట: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌లతో కలిసి ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు స్లిప్పుల ముద్రణ, పంపిణీ, ఎన్నికల నియమావళి అమలు, ఎన్నికల ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల శిక్షణ, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. పోలింగ్ ఏర్పాట్ల పనులు పూర్తి స్థాయిలో చేయాలని సిద్ధార్థ్ జైన్ ఆదేశించారు. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఆరు జిల్లాల్లో జరిగిన శిక్షణా కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీ సునీల్ సుమిత్ గరుడ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస్ మూర్తి , సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ర్యాండమైజేషన్

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై మాక్ పోలింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్నందున ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అధ్యక్షతన మంగళవారం శిక్షణ ఇచ్చారు. ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు.

వేధింపులతోనే పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

కేడీపేటకు చెందిన పీఈటీ అరెస్ట్



నిందితుడు విజయ్‌కుమార్

పీఎంపాలెం: పాలిటెక్నిక్ విద్యార్థినిని వేధించి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన గతంలో పీఈటీగా పనిచేసిన వ్యక్తిని పీఎంపాలెం పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. పీఎంపాలెంలోని సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని(17) గత నెల 20న ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కేడీపేటలోని ఎంఎల్‌పురంలో విద్యార్థిని తండ్రి కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. నర్సీపట్నం మార్కెట్ కమిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ.. పెద్ద కుమార్తె(17)ను సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చదివిస్తున్నాడు. ఆమె పీఎంపాలెంలోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. గత నెల 20న క్లాస్‌కు వెళ్లడం లేదని ఇంటికి వస్తున్నానని తండ్రికి ఫోన్ చేసింది. ఆ తర్వాత ఫోన్ చేయలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. అదే రోజు సాయంత్రం హాస్టల్ నిర్వాహకుడు గణేష్ ఆమె తండ్రికి ఫోన్ చేసి.. మీ కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలియజేశాడు. ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ వై.రామకృష్ణ దర్యాప్తు ప్రారంభించారు.

గుట్టు విప్పిన ఫోన్ కాల్స్

పోలీసులు స్వాధీనం చేసుకున్న విద్యార్థిని ఫోన్‌లో కాల్స్ పరిశీలించారు. ఒకే నంబర్‌తో వందల సంఖ్యలో ఎస్ఎంఎస్‌లు, కాల్స్ ఆమె ఫోన్‌కు వచ్చినట్లు గుర్తించారు. ఆ ఫోన్ కాల్స్ చేసింది. గతంలో పనిచేసిన పీఈటీ ఇత్తుల విజయ్ కుమార్(33) అని తెలుసుకున్నారు. అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేడీ పేటకు చెందిన విజయ్‌కుమార్ గతంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా పనిచేశాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను లైంగికంగా వేధించాడు. ఈ క్రమంలో విద్యార్థిని పై చదువుల కోసం సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో చేరింది. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఆమె పీఎంపాలెం వచ్చేయడంతో అతను పీఈటీ ఉద్యోగం మానేశాడు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నట్లు చెప్పి ఆరిలోవలోని లక్ష్మీపురంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని విద్యార్థిని కదలికలు తెలుసుకునేవాడు. ఆమెను వెంబడించి వేధించేవాడు. ఆ వేధింపులకు తాళ లేక ఆ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది.

ముగ్గురు పిల్లలున్నా..

నిందితుడు విజయ్‌కుమార్‌కు 9 ఏళ్ల కిందటే వివాహం అయింది. ముగ్గురు పిల్లల తండ్రి. అయినా వక్రబుద్ధితో బాలికను లైంగికంగా వేధించాడు. ఆమె తోటి స్నేహితురాళ్ల ముందు కూడా వేధింపులకు పాల్పడేవాడు. చెప్పుకోలేని బాధ, అతని పీడ పోవాలంటే ఆత్మహత్యే శరణ్యమని భావించి తనువు చాలించిందని పోలీసులు భావిస్తున్నారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఏఎస్ఐ మృతి

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విశ్రాంత ఏఎస్ఐ ప్రాణాలు కోల్పోయారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. విశాలాక్షినగర్ రామాలయం సమీపంలో నివాసం ఉంటున్న విశ్రాంత ఏఎస్ఐ శ్రీనాథు ఈశ్వరరావు(63) ఉదయం పాలు ప్యాకెట్ కొని ఇంటికి నడుచుకుంటూ వస్తున్నారు. ఆ సమయంలో హనుమంతవాక నుంచి దయాల్‌నగర్ వైపు కూరగాయలు లోడుతో వెళుతున్న బొలేరో వాహనం రోడ్డు దాటుతున్న ఈశ్వరరావును ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్రగాయమైంది. స్థానికులు సహాయంతో కుటుంబసభ్యులు వెంటనే అతనిని హెల్త్‌సిటీలో ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతుడు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సోమశేఖరరావు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

నేటి నుంచి సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ సీనియర్ వుమెన్ అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రైల్వే గ్రౌండ్స్‌లో ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఏపీలోని ఉమ్మడి జిల్లాల జట్లు నాలుగు పూల్స్‌లో పోటీపడనున్నాయి. ఆయా పూల్స్‌లో ఆధిక్యత సాధించిన జట్లు సెమీస్‌లో తలపడనున్నాయి. ఆతిథ్య విశాఖ జట్టు డి పూల్‌లో తలపడనుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రజట్టుకు ఎంపిక చేయనున్నామని ఏపీ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ తెలిపారు. ఎంపిక చేసిన జట్టు గోవాలో జరిగే అంతర రాష్ట్ర సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనుందన్నారు.